సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 27 । జనవరి । 2023



జ్ఞాన సరస్వతి మహాయజ్ఞం

విశాఖ: జ్ఞాన సరస్వతి మహా యజ్ఞంలో బ్రహ్మశ్రీ చాగంటి పాల్గొన్నారు. చిన్నారులకు సరస్వతీ కటాక్షం కలగాలన్నారు.



తాజుద్దీన్‌బాబా జయంతి

తగరపువలస: దాకమర్రిలో గల ఆశ్రమంలో తాజుద్దీన్‌బాబా జయంతి వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి.



కనకమహాలక్ష్మి సన్నిధిలో..

విశాఖ: కనకమహాలక్ష్మిని స్వామి విజయేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. 'శ్రీ కనక ధారాస్తవం' పారాయణ చేశారు.

న్యూస్‌రీల్

న్యాయవ్యవస్థ రాజ్యాంగానికి వెన్నెముక



జాతీయ జెండా ఎగుర వేస్తున్న జిల్లా జడ్జి

విశాఖ లీగల్: ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవ్యవస్థ రాజ్యాంగానికి వెన్నెముక వంటిదని చెప్పారు. మెట్రో పాలిటిన్ సెషన్స్ జడ్జి ఎం.తిరుమలరావు, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి గోవాడ చెరకు రైతులకు చెల్లింపులు

తొలి విడతలో రైతుల ఖాతాల్లోకి రూ.7.32 కోట్లు

చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులకు శుభవార్త. ఈ ఏడాది క్రషింగ్‌కు సంబంధించిన చెరకు పేమెంట్స్‌ను ఈ నెల 27 నుంచి చెల్లించేందుకు షెడ్యూల్ సిద్ధం చేసినట్టు ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సన్యాసినాయుడు గురువారం వెల్లడించారు. ఈ సీజన్ క్రషింగ్‌ను గత డిసెంబరు 13న ప్రారంభించగా నెలాఖరు నాటికి 4,111 మంది రైతులు 29,288 టన్నుల చెరకు సరఫరా చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది టన్నుకు రూ.2,821.25 చొప్పున మద్దతు ధర ఇవ్వాల్సి ఉండగా, తొలి విడతలో టన్నుకు రూ.2,500 చొప్పున రైతుల ఖాతాల్లోకి శుక్రవారం నుంచి జమ చేయనున్నట్టు పేర్కొన్నారు. తొలి దశలో రూ.7 కోట్ల 32 లక్షలను రైతులకు చెల్లించనున్నట్టు వెల్లడించారు.

29న మినిస్టీరియల్ ఉద్యోగుల ఎన్నికలు

నక్కపల్లి: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా యూనిట్ ఎన్నికలను ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి డి.సీతారామరాజు తెలిపారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ విశాఖ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఎన్నికల నిర్వహణ జరుగుతుందన్నారు. ప్రస్తుత జిల్లా కార్యవర్గం పదవీకాలం పూర్తి కావడంతో రాష్ట్ర సంఘం అనుమతితో నూతన కార్యవర్గ ఎన్నికలకు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల అధికారిగా ఏపీఎన్జీవో సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ పి.అప్పలరాజును నియమించినట్లు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న 16 యూనిట్ల సభ్యులు విధిగా హాజరై ఈ ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనాలని వారు కోరారు. ఎన్నికల పరిశీలకులుగా సిహెచ్. మురళి, ఎం.శ్రీరాములు, ఏపీ మినిస్టీరియల్ సంఘం విజయనగరం శాఖ వారు వ్యవహరిస్తారని చెప్పారు.

ప్రగతి వీచికలు

- సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి కల్పనకు పెద్దపీట
- పల్లెల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి
- గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



ముువ్వన్నెలతో విద్యార్థుల విన్యాసం



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



జెండా వందనం చేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి, ఎస్పీ గౌతమి సాలి

సాక్షి, అనకాపల్లి: కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో ప్రతి పల్లె ప్రగతి బాట పట్టనుందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. సంక్షేమం, అభివృద్ధి, మౌలిక వసతులు, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తూ సామాజిక, ఆర్థిక స్వావలంబన కోసం అనేక సంక్షేమ పథకాలను పేదలకందిస్తున్నామన్నారు. కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. గురువారం ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో 74వ గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. కలెక్టర్ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీసు దళాలు కవాతు నిర్వహించాయి. పోలీసు వాహనంపై నుంచి కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి, ఎస్పీ గౌతమి సాలి, ట్రెయినీ కలెక్టర్ ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందికి కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ వెంకటరమణ, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు

పతాకావిష్కరణ అనంతరం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ.. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేస్తున్నట్టు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా 2,50,888 మంది రైతు కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయన్నారు. రూ.208.06 కోట్ల పెట్టుబడి సాయం, వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకం కింద 1,042 మంది రైతులకు రూ.45.62 లక్షల పంట నష్ట పరిహారం, యంత్ర సేవ పథకం ద్వారా 272 గ్రూపులకు రూ.676.92 లక్షల రాయితీతో పాటు 157 ట్రాక్టర్లు, వివిధ వ్యవసాయ పరికరాలను సరఫరా చేశామన్నారు. ఉద్యానవన శాఖలో రూ.7.65 కోట్లతో ఈ ఏడాది 36 పంట సేకరణ కేంద్రాలు,15 యూనిట్ల సోలార్ శీతల గిడ్డంగులు నెలకొల్పామన్నారు. కొత్తగా 4 వేల ఎకరాలలో వివిధ పండ్ల తోటల పెంపకం జరుగుతోందన్నారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా 10,244 మత్స్యకార కుటుంబాలకు రూ.10 వేల చొప్పున రూ.10.24 కోట్ల చేపల వేట నిషేధకాల భృతి పంపిణీ జరిగిందన్నారు.

ఇంకా ఏమన్నారంటే..

- వైఎస్సార్ ఆసరా ద్వారా 31,892 సంఘాలకు రూ.497 కోట్ల రుణ మాఫీ, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా 36,601 సంఘాలకు రూ.71.34 కోట్లు, వైఎస్సార్ చేయూత ద్వారా 1,15,101 మంది మహిళలకు 582.84 కోట్లు మంజూరు చేశారు. జగనన్న తోడు ద్వారా 94,597 మంది చిరు వ్యాపారులకు రూ. 97.58 కోట్ల వడ్డీలేని రుణం మంజూరు చేశారు.
- ఉపాధి హామీ పథకం ద్వారా వేతనదారులకు 84.5 లక్షల పని దినాలు కల్పించి రూ.163.840 కోట్లు చెల్లించి, రాష్ట్రంలో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది.
- 10 ఐసీడీఎస్ ప్రాజెక్టులలో 1,908 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నెలకు 20 వేల మంది గర్భిణులు, బాలింతలకు, 5 సంవత్సరాల లోపు 84వేల మంది పిల్లల కోసం రూ.60.28 కోట్లతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకం అమలు చేస్తున్నారు.
- జగనన్న విద్యా దీవెన పథకంలో 42,816 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.96.48 కోట్లు, జగనన్న వసతి దీవెన పథకం ద్వారా 39,816 మందికి రూ.37.18 కోట్లు అందించారు.
- షెడ్యూల్డు కులాల సంక్షేమ కార్పొరేషన్ ద్వారా 67 మినీ ట్రక్కులను 90 శాతం సబ్సిడీతో అందించేందుకు రూ.3.9 కోట్లు వెచ్చించారు.
- జగనన్న చేదోడు పథకం ద్వారా 24,645 మంది లబ్ధిదారులకు రూ.24.64 కోట్ల ఆర్థిక సహాయం
- వైఎస్సార్ కాపు నేస్తం ద్వారా 49,009 మందికి రూ.73.51 కోట్ల సాయం
- ఈబీసీ నేస్తం పథకం ద్వారా 3077 మందికి రూ.461.55 లక్షలు
- జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా 3,796 మంది బాలబాలికలకు ఇప్పటివరకు రూ.3.78 కోట్ల ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలు, 1208 మంది బాలబాలికలకు రూ.1.35 కోట్ల పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు
- వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా 252 చేనేత కుటుంబాలకు రూ.60.48 లక్షల ఆర్థిక సహాయం, 2,747 మంది చేనేత కార్మికులకు వృద్ధాప్య పింఛన్లకు రూ.75.54 లక్షల పంపిణీ
- రూ.500 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణ పనులు పురోగతిలో వున్నాయి. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా జిల్లాలో 47,560 మందికి రూ.8,826 లక్షల ఖర్చుతో వైద్యం, 424 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు
- నాడు-నేడు ద్వారా జిల్లాలో ఇప్పటివరకు రెండు దశలలో రూ.417 కోట్లతో 1,214 ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ. అమ్మ ఒడి పథకం ద్వారా 1,58,722 మంది తల్లుల బ్యాంకు ఖాతాలలో రూ.238 కోట్లు జమ. జగనన్న విద్యా కానుక పథకం ద్వారా 1,35,527 మంది బాలబాలికలకు రూ.22.60 కోట్ల విలువైన విద్యా కానుక కిట్ల పంపిణీ. 18,741 మంది విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌ల అందజేత
- జల జీవన్ మిషన్ పథకం ద్వారా 2,45,835 ఇళ్లకు రూ.84.79 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు.. జగనన్న కాలనీలలో 595 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం కోసం తాత్కాలిక నీటి సరఫరాకు రూ.10.93 కోట్ల వ్యయం.. 268 గ్రామ సచివాలయాల్లో శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం పూర్తి
- రూ.86.13 కోట్లతో 285 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం పూర్తి.. రూ.38.13 కోట్లతో 155 ఆర్బీకేల నిర్మాణం పూర్తి.. రూ.23.57 కోట్లతో 78 వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం పూర్తి..
- 'పీఎం ఆవాస్ యోజన -వైఎస్సార్ (బీఎల్‌సీ) పథకం ద్వారా జిల్లాకు 56,254 ఇళ్లు మంజూరు.. రూ. 30.87 కోట్లతో 8,250 ఇళ్లు పూర్తి.. వైఎస్సార్ గ్రామీణ పథకం ద్వారా జిల్లాకు మంజూరైన 4,401 ఇళ్లలో ఇప్పటివరకు రూ.2.41 కోట్లతో 101 ఇళ్లు పూర్తి.. ఏపీ టిడ్కో ద్వారా జిల్లాలో రూ.533 కోట్లతో 6,184 ఇళ్ల నిర్మాణం పూర్తి
- ఇటీవల సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన ఏలేరు-తాండవ అనుసంధానం పనులను రూ.470.05 కోట్లతో చేపట్టి రెండు జిల్లాల్లో 51.465 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించనున్నాం.
- వైఎస్సార్ వ్యవసాయ ఉచిత విద్యుత్ పథకం ద్వారా జిల్లాలో 22,542 మంది వినియోగదారులకు రూ.9.47 కోట్ల సబ్సిడీ.. 67 జగనన్న కాలనీల్లో 1,143 గృహాలకు విద్యుదీకరణ పూర్తి.. ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులకు రూ.9.63 కోట్ల సబ్సిడీ అందించాం.
- వైఎస్సార్ వాహనమిత్ర ద్వారా జిల్లాలో 12,447 లబ్ధిదారులకు 12.44 కోట్ల ఆర్థిక సహాయం
- స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ ద్వారా 1,432 మంది నిరుద్యోగులకు స్థానిక పరిశ్రమలలో ఉద్యోగాల కల్పన
- జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో 601 గ్రామ పంచాయతీల్లో విజువల్ క్లీన్ కార్యక్రమం చేపట్టాం
- 311 ఆర్బీకేల ద్వారా 4,582 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 279 సచివాలయాల పరిధిలో 1023 పనులను రూ.37.09 కోట్ల మంజూరు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. గిరిజన సంప్రదాయ థింసా నృత్యం, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌తో యోగా, అగ్నిప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అదుపు చేస్తారనే అంశంపై ఫైర్ సిబ్బంది ప్రదర్శన ఆకట్టుకున్నాయి. మార్టూరు జెడ్పీ హైస్కూల్ బృందం మొదటి స్థానం, డీఏవీ పబ్లిక్ స్కూల్ రెండో స్థానం, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు.

ఆకట్టుకున్న ప్రభుత్వ శకటాలు

జిల్లాలో అమలు జరుగుతున్న పలు సంక్షేమ పథకాలపై ఆయా శాఖలు ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. మొత్తం 22 శకటాలు పాల్గొన్నాయి. వైద్యశాఖ ప్రదర్శించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ శకటానికి మొదటి స్థానం, స్కిల్ డెవలప్‌మెంట్‌కు రెండో స్థానం, స్వచ్ఛ సంకల్పం శకటానికి తృతీయ స్థానం దక్కాయి.



ప్రథమ బహుమతి పొందిన విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ ఫిజీషియన్ శకటం

పద్మశ్రీ అవార్డు గ్రహీత సీవీ రాజుకు ఘన సన్మానం



సీవీ రాజును సన్మానించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ కల్పనాకుమారి

కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పద్మ అవార్డుల్లో ఏటికొప్పాక కళాకారుడు సీవీ రాజును పద్మశ్రీ వరించింది. ప్రకృతి రంగులతో ఏటికొప్పాక బొమ్మలు తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్న ఆయనకు కళారంగంలో ఈ అవార్డు వచ్చింది. రిపబ్లిక్ డే సందర్భంగా ఆయనను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి దుశ్శాలువాతో సత్కరించి ఘన సన్మానం చేశారు.

బొమ్మను చేసి.. ప్రాణం పోసి..

జౌను.. సీవీ రాజు ఏటికొప్పాక బొమ్మలకు నిజంగా ప్రాణమే పోశారు.. ఈ లక్కబొమ్మలకు ఖండాంతర ఖ్యాతి రావడం వెనుక మూడున్నర దశాబ్దాల ఆయన కృషి దాగివుంది. యలమంచిలి మండలంలోని మారుమూల గ్రామం ఏటికొప్పాకకు చెందిన చింతలపాటి వెంకటపతిరాజు (సీవీరాజు) తమ తాత నుంచి లక్కబొమ్మల తయారీ కళ వారసత్వంగా వచ్చినా మొదట్లో అంతగా దృష్టి సారించలేదు. క్రమక్రమంగా ఏటికొప్పాక బొమ్మలకు వైభవం తగ్గిపోతూ రావడంతో ఆయన ఈ రంగానికి ఎలాగైనా పూర్వ స్థితి తీసుకురావడానికి నడుం బిగించారు. ఆ ప్రయత్నంలో ఆయన సాధించిన విజయానికే పద్మశ్రీ వరించింది.

- సీవీ రాజు కృషితో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన 'ఏటికొప్పాక'
- లక్కబొమ్మలకు సహజ రంగులద్దిన కళాకారుడు
- పద్మశ్రీ వరించడంతో మురిసిపోతున్న హస్తకళారంగం

అనకాపల్లి రూరల్/యలమంచిలి: ఒకపక్క అంకుడు కర్ర కొరత.. మరోపక్క సరైన మార్కెటింగ్ అవకాశాలు లేకపోవడం ఏటికొప్పాక హస్తకళారంగాన్ని కొన్నాళ్లపాటు అవస్థలపాలు చేశాయి. కుటుంబంలో నలుగురు రోజంతా పనిచేసినా ఇల్లు గడవడమే కష్టంగా వుండేది. ఈ సమయంలో చాలామంది వేరే వృత్తులకు మరలిపోయారు. ఈ పరిణామం సీవీ రాజును ఆలోచింపజేసింది. ఇలా జరిగితే తమ గ్రామానికి వున్న గుర్తింపు, ఖ్యాతి పోతుందని భావించి, పడిపోతున్న హస్తకళలకు ప్రాణం పోసేందుకు శ్రీకారం చుట్టారు. లక్కబొమ్మల తయారీని కొత్త పుంతలు తొక్కించేందుకు 1999లో హస్తకళా నిలయాన్ని ప్రారంభించారు.

సహజసిద్ధ రంగుల తయారీలో శిక్షణ

ఢిల్లీ వెళ్లి అధ్యయనం చేసిన సీవీ రాజు లక్కబొమ్మల తయారీలో కొత్త పద్ధతులు ప్రవేశపెట్టారు. మార్కెటింగ్ టెక్నిక్‌తో ముందు విదేశాల నుంచి ఆర్డర్లు వచ్చేలా కృషి చేశారు. అయితే రసాయనాలు కలిపిన రంగులు వినియోగిస్తే విదేశాల్లో మనుగడ ఉండదని గ్రహించిన రాజు సహజసిద్ధ రంగులనే వినియోగించాలని సహచరులకు సూచించారు. హస్తకళా నిలయంలో సహజ రంగుల తయారీలో శిక్షణ ఏర్పాటు చేశారు. ఇది ఎంతో సత్ఫలితాలను ఇచ్చింది.

పసుపు, కరక్కాయ, ఇండిగో పిక్కలు, జాఫ్రా వంటి వస్తువులతో సహజసిద్ధ రంగులను తయారు చేసి బొమ్మలకు అద్దడంతో విదేశాల నుంచి డిమాండ్ పెరిగింది. ఏటికొప్పాక బొమ్మలను పూర్వ వైభవం వచ్చింది.

ఎందరికో స్ఫూర్తి

ఎంతోమంది హస్తకళాకారులను, యువకులను ప్రోత్సహించి, మళ్లీ లక్కబొమ్మల తయారీపై మక్కువ కలిగేలా చేశారు సీవీ రాజు. ఆయన ప్రేరణతోనే శ్రీశైలపు చిన్నయాచారి, శరత్ వంటి అనేక మంది కళాకారులు తయారు చేసిన లక్కబొమ్మలకు జాతీయ స్థాయిలో కూడా ఎన్నో పురస్కారాలు లభించాయి. ఏటికొప్పాక బొమ్మలను పోలినట్టు డూప్లికేట్ లక్కబొమ్మలను చైనా మార్కెట్లోకి దించినప్పటికీ, ఆ పోటీని ఇక్కడి హస్తకళాకారులు తట్టుకుని నిలబడ్డారు. క్రమంగా చైనా బొమ్మల మార్కెట్ పడిపోగా ఏటికొప్పాక కళాకారులు తయారు చేసిన కళాఖండాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అంతరించిపోతున్న అద్భుత కళకు అన్నీ తానై విశేష సేవలందించిన సీవీరాజు కృషిని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. పద్మశ్రీ అవార్డును ప్రకటించింది.

సీవీ రాజును వరించిన పురస్కారాలు

- పద్మావతి అసోసియేట్స్ పేరుతో నడుపుతున్న హస్తకళా నిలయానికి 2002లో రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా జాతీయ అవార్డు
- క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి సత్కారం
- తెలంగాణ కాఫ్ట్స్ కౌన్సిల్ నుంచి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు
- 2006లో సౌత్ ఆసియా నుంచి సీల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు






రాష్ట్రపతి అబ్దుల్ కలాం నుంచి అవార్డు అందుకుంటున్న సీవీ రాజు (ఫైల్)



ఏటికొప్పాకలో రాజు స్థాపించిన హస్తకళా నిలయం

భవిష్యత్తు తరాలకు ఆదర్శం కావాలి



ఏటికొప్పాక కళ కనుమరుగు కాకూడదు. ప్రపంచ దేశాల్లో మా లక్కబొమ్మలకు ప్రాముఖ్యత ఉంది. ఇది నా గొప్పతనం కాదు.. కళకు ఉన్న గొప్పతనం. 2020 ఆగస్టులో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మన్ కీ బాత్‌లో నేను మాట్లాడాను. ఈ కళకు తగిన సాంకేతికతను అందించి.. భవిష్యత్తు తరాలవారికి కూడా ఏటికొప్పాక బొమ్మల తయారీ ఉపాధి చూపాలని ఆయన ఆకాంక్షించారు. మా కళను గుర్తించినందుకు ధన్యవాదాలు.

–సీవీ రాజు, ఏటికొప్పాక

విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌కు అభినందనల వెల్లువ



విశాఖ డెయిరీ చైర్మన్‌గా నియమితులైన ఆడారి ఆనంద్ కుమార్‌కు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలుపుతున్న పాలకవర్గం

అక్కిరెడ్డిపాలెం: విశాఖ డెయిరీ చైర్మన్‌గా ఎన్నికైన ఆడారి ఆనంద్‌కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. గురువారం ఉదయం విశాఖ డెయిరీలో జరిగిన సమావేశంలో పాలకవర్గం ఆయన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

ఈ సందర్భంగా నూతన చైర్మన్ ఆనంద్‌కుమార్‌కు డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్వీ రమణ, పాలకవర్గ సభ్యులు, అధికారులు, విశాఖ డెయిరీ వివిధ విభాగాల ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

చింతపల్లి @4.2 డిగ్రీలు

- మన్యంలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. చింతపల్లిలో గురువారం 4.2 డిగ్రీలు, అరకులోయలో 7.5 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలిగాలులు విజృంభిస్తున్నాయి. పొగమంచు తీవ్రత కాస్త తగ్గింది. సూర్యోదయం వేగంగానే అవుతున్నప్పటికీ చలిగాలులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగు రోజుల నుంచి చింతపల్లి ప్రాంతంలో ఐదు లోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నెలకొంటున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలు చలి తీవ్రతకు గజగజ వణుకుతున్నారు.అత్యంత శీతల ప్రాంతమైన లంబసింగిలో చలిపులి పర్యాటకులను భయపెడుతోంది. ప్రజలు సాయంత్రం నుంచే చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.



ఆటోబోల్తా, ఆరుగురికి గాయాలు


బోల్తాపడ్డ ఆటో


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

నక్కపల్లి: మండలంలో గురువారం జానకయ్యపేటనుంచి అడ్డురోడ్డు వెళ్తున్న ఆటో చుక్కలవాని లక్ష్మీపురం వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎరిపల్లి సింహాచలం, జి.అప్పలనర్స, కె.మాతయ్య, దేముడమ్మ, సత్యవతి, చినతీనార్లకు చెందిన ఆటోడ్రైవర్ అంజి గాయపడ్డారు. బోల్తాపడిన సమయంలో ఆటోలో 9 మంది ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. వీరిలో ఆరుగురికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

• ప్రతిభకు పురస్కారం




అనకాపల్లిలో జాతీయజెండాకు వందన సమర్పణ చేస్తున్న ఎంపీ సత్యవతి, కలెక్టర్, జేసీ, ఎస్పీ

జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి నుంచి అవార్డులు అందుకుంటున్న జిల్లా అగ్నిమాపక అధికారి బి.లక్ష్మణస్వామి, పరవాడ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఇంటర్‌బోర్డు జిల్లా అధికారి పి.మురళీధర్, ఆర్డీవో వీర్రాజు, ఎలక్షన్ డీటీ రవికుమార్, పంచాయతీ రాజ్ డీఈ వేణుగోపాల్, అగ్రికల్చర్ ఏడీ వసంత కుమారి, డీపీవో ఆర్.శిరీషారాణి, విద్యుత్‌శాఖ నోడల్ అధికారి ఎస్.రమణమూర్తి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వీ.సీహెచ్.ఎస్.జీ.రావు, సీపీవో రామారావు, అనకాపల్లి ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాము, కలెక్టర్ కార్యాలయం సీసీ సందీప్, డీఎంఅండ్‌హెచ్‌వో హేమంత్, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఫిషర్స్ డీడీ పి.లక్ష్మణరావు, ఐఅండ్‌పీఆర్ డీఈ కె.ఇందిరావతి, డీసీహెచ్‌ఎస్ శ్రావణ్‌కుమార్, దిశ డీఎస్పీ మళ్ల మహేష్


కలెక్టర్, ఎస్పీ, జేసీలతో ప్రశంసాపత్రాలు అందుకున్న డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





ఆకట్టుకున్న శకటాలు


ద్వితీయ బహుమతి పొందిన స్కిల్ డెవలప్‌మెంట్ శకటం


తృతీయ బహుమతి పొందిన స్వచ్ఛ సంకల్పం శకటం


ఆకట్టుకున్న వైఎస్సార్ క్రాంతిపథం శకటం, పథకం ద్వారా ఆరంభించిన వ్యాపారాలు


వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానంపై రూపొందించిన శకటంలో వివిధ పంటల నమూనాలు

ఉత్తమ శకటాలకు అవార్డులు


విలేజ్ క్లినిక్(ప్రథమ) తరఫున కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న డీఎంహెచ్‌వో హేమంత్



స్కిల్ డెవలప్‌మెంట్(ద్వితీయ)కు ప్రశంసా పత్రం అందుకుంటున్న వీసీహెచ్‌ఎస్‌జీ రావు


స్వచ్ఛ సంకల్పం(తృతీయ) తరఫున కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న వెంకటలక్ష్మి


సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మార్టూరు హైస్కూల్ విద్యార్థులతో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకెళ్దాం

గణతంత్ర దినోత్సవంలో జేసీ కల్పనా కుమారి


కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న, జేసీ కల్పనాకుమారి

తుమ్మపాల : 74వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్‌లో గురువారం వేడుకలు ఘనంగా జరిగాయి. జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పతాకాన్ని ఆవిష్కరించి, వందన సమర్పణ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 74 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. రాజ్యాంగాన్ని అమల్లోకి తెస్తూ, భారత రాష్ట్రపతి జాతీయజెండాను ఆవిష్కరించారని, అప్పటి నుంచి ఏటా జనవరి 26న గణతంత్ర దినోత్సవం నిర్వహించుకున్నట్టు పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో అభివృద్ధి బాటన పయనించాలని అభిలషించారు. అంతకుముందు చిన్నారులకు స్వీట్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్వో పి.వెంకటరమణ, సీపీవో రామారావు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో రెప రెపలాడిన జెండా

అనకాపల్లిటౌన్ : స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ జెండాను ఎగురవేసి ఎస్పీ గౌతమి సాలి సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో అడిషనల్(పరిపాలన)ఎస్పీ బి.విజయభాస్కర్, క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, డీఎస్పీలు బి.సునీల్, కె.ప్రవీణ్‌కుమార్, పి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.


మువ్వన్నెలజెండాకు సెల్యూట్ కొడుతున్న ఎస్పీ గౌతమిసాలి

న్యాయసముదాయంలో..

అనకాపల్లిటౌన్: స్థానిక న్యాయ సముదాయంలో గురువారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి ఎస్ఎం ఫణికుమార్ రాజ్యాంగం తెచ్చిన చట్టాలను వివరించారు. అంతకు ముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఆయనతో పాటు అడిషనల్ సివిల్ జడ్జి అమరరంగేశ్వరరావు, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి గంగరాజులు, న్యాయమూర్తులు షేక్ మహ్మద్ అబ్దుల్ ఫరేజ్, ఎస్.విజయచందర్, నిరూపభంజ్, ప్రదీప నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వి.రాజశేఖర్, కార్యదర్శి ఎస్.దివాకర్ పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయమూర్తులు

అలరించిన శకటాలు

తుమ్మపాల : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గుడ్ షెఫర్డ్ స్కూల్ విద్యార్థులు ఏర్పాటుచేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని జిల్లా జడ్జి ఫణికుమార్ అన్నారు. పట్టణంలో గుడ్‌షెపర్డ్ స్కూల్‌లో 74వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. జెండా ఆవిష్కరణ, భిన్నత్వంలో ఏకత్వం ప్రదర్శించేందుకు ఏర్పాటుచేసిన 20 శకటాల ఊరేగింపును ఆయన ఆవిష్కరించారు. డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ప్రారంభించారు. పట్టణంలో చేపట్టిన శకటాల ర్యాలీలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

- మహాత్మ జ్యోతిబాపూలే గురుకులంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవం కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగా, కరాటే, పిరమిడ్ విన్యాసాలు చేశారు.


స్టాళ్లను పరిశీలిస్తున్న జడ్జి ఫణికుమార్, దాడి రత్నాకర్

టీచర్ మందలించిందనే బలవన్మరణం

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ చైతన్య కళాశాలలో బుధవారం సాయంత్రం విద్యార్థిని అనూష ఆత్మహత్యకు టీచర్ మందలించడమే కారణమని భీమిలి సీఐ లక్ష్మణమూర్తి తెలిపారు. చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న అనకాపల్లి జిల్లా మునగపాకకు చెందిన విద్యార్థిని అనూషయాదవ్(17) బుధవారం కాలేజీ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఓ సూసైడ్ నోట్ లభించింది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... నీట్ ప్రిపరేషన్ కోసం కళాశాలలో ప్రతీ వారం పరీక్ష పెడుతుంటారు. ఈ క్రమంలో ఈ నెల 23న కెమిస్ట్రీ పరీక్ష నిర్వహించారు. అయితే అనూష పరీక్ష ఆలస్యంగా రాయడంతో కెమిస్ట్రీ టీచర్ తోటి విద్యార్థుల ముందు ఆమెను మందలించడంతో మనస్తాపానికి గురై సూసైడ్‌నోట్ రాసి ఆత్మహత్య చేసుకుంది. గురువారం రిపబ్లిక్ డే సెలవు కావడంతో శుక్రవారం కళాశాలలో పూర్తి వివరాలు సేకరిస్తామని, ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి బాలికల హాకీ పోటీలు

- యలమంచిలి వేదికగా 13వ జూనియర్ హాకీ పోటీలు
- మూడు రోజులు.. 13 జిల్లాలు.. 16 జట్లు

యలమంచిలి : 13వ అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల హాకీ టోర్నమెంట్ ఈ నెల 28 నుంచి 30 వరకు యలమంచిలి రాజీవ్ హాకీ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు అనకాపల్లి జిల్లా హాకీ అడ్‌హాక్ కమిటీ సభ్యులు ఆడారి వీరునాయుడు తెలిపారు. గురువారం యలమంచిలిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ యలమంచిలి హాకీ అసోసియేషన్ కన్వీనర్ కొఠారు నరేష్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా ఏర్పడ్డాక తొలిసారిగా జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి బాలికల జూనియర్ హాకీ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 18 జిల్లాల నుంచి 16 హాకీ జట్లు ఈ పోటీలలో పాల్గొంటాయన్నారు. ఈ పోటీలను ఎమ్మెల్యే కన్నబాబురాజు, రావి గాంధీ(లాస్‌ఏంజెల్స్), మహా సిమెంట్ ఫ్యాక్టరీ(ములకలాపల్లి), హిమశేఖర్(హైదారాబాద్), జిల్లా అసోసియేషన్ సౌజన్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో దాసరి మహేష్, జీవీ రెడ్డి, జి.రాంబాబు, కె.సాయి, యమున తదితరులు పాల్గొన్నారు.


హాకీ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర వేడుకలు


జెండాను ఎగురవేస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

అనకాపల్లిటౌన్ : స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ విప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ మువ్వన్నెల జెండా ఎగురవేసి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షురాలు సుజాత, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పి.డి. గాంధీ, చోడవరం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ముచ్చకర్ల వెంకటరావు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ బావిలోపడి వలంటీర్ మృతి


ప్రమాదంలో మరణించిన వియ్యపు ఏసుబాబు

యలమంచిలి : ప్రమాదవశాత్తు బావిలో పడి వలంటీర్ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివారాల మేరకు యలమంచిలి మండలం రుక్మిణీపురం గ్రామానికి చెందిన వలంటీర్ వియ్యపు ఏసుబాబు(24) తన ఇంటి వద్ద ఉన్న నేల బావి గోడపై కూర్చుని సెల్‌ఫోన్ చూస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి నేల బావిలో పడిపోయాడు. గోడలకు బలంగా తాకడంతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమెదు చేసినట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

విదేశీయుల సందడి



ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన ఒనకఢిల్లీలో గురువారం జరిగిన వారపు సంతలో విదేశీయులు సందడి చేశారు. వారపు సంతకు వచ్చిన అంద్రహాల్,ఒనమనాల్ గ్రామాల బొండా జాతి గిరిజనులతో ఫొటోలు తీసుకున్నారు.

క్లుప్తంగా

గౌరీపరమేశ్వరులకు సారె సమర్పణ



గౌరీ దేవాలయం నుంచి సారె తీసుకు వెళ్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం గౌరీపరమేశ్వరులమహోత్సవాన్ని పురస్కరించుకుని గౌరీ పంచాయతన దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు, సారె గురువారం సమర్పించారు. ఈ సందర్భంగా పంచాయతన దేవాలయం అధ్యక్షుడు సన్యాసినాయుడు మాట్లాడుతూ సుమారు 30 సంవత్సరాలుగా అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి సూర్యనారాయణ, సభ్యులు ఆళ్ల లక్ష్మీనరసింహారావు, పెంటకోట బాలకృష్ణ, బొడ్డేడ అప్పారావు, గీతా మహిళా మండలి, సత్తెమ్మ తల్లి దేవస్థానం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మనోహరరావు నాయుడు తీర్థం

అనకాపల్లిటౌన్: గవరపాలెం పార్కు సెంటర్‌లో ఈనెల 27న కొణతాల మనోహరరావు నాయుడు తీర్థం నిర్వహిస్తున్నట్లు తీర్థ మహోత్సవం ప్రతినిధులు కొణతాల నగేష్ గురువారం పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ తీర్థం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకూ విశాఖ ఓమ్ని ఆసుపత్రి వారిచే ఉచిత వైద్య శిబిరం, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

28న కుసుమ హరనాథుల కల్యాణం

అనకాపల్లిటౌన్: గవరపాలెం కోటవీధి కుసుమహరనాథ మందిరంలో ఈనెల 28న కుసుమహరనాథ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రచార కార్యదర్శి ఎస్.ఉమామహేశ్వరరావు గురువారం తెలిపారు. మధ్యాహ్నం 2.45 గంటలకు స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు ఆలయానికి వచ్చే భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. రాత్రికి స్వామివారికి పల్లకి సేవ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
వాల్తేరు వీరయ్య	- సత్యనారాయణ స్క్రీన్-1
వీర సింహారెడ్డి	- సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	- షిర్డిసాయి
వారసుడు	- పర్తిసాయి
వీర సింహారెడ్డి	- వెంకటేశ్వర
వారసుడు	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 6,585 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,510	4,230
మొదటి రకం	3,170	3,460
రెండో రకం	2,890	3,250
మూడో రకం	2,800	2,880

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 29 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-12 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 324 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 267 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

అండా దండ.. మువ్వన్నెల జెండా

మువ్వన్నెల జెండా వాడవాడలా రెపరెపలాడింది. రాజ్యాంగ స్ఫూర్తిని మదినిండా నిలుపుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు త్రివర్ణపతాకాన్ని ఎగరవేశారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, విద్యాలయాలు, సంస్థలు, బ్యాంకుల వద్ద గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



బాలికల హైస్కూల్లో జెండా ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం స్వర్ణకుమారి



డైట్ కళాశాలలో విద్యార్థులతో చైర్మన్ దాడి రత్నాకర్



తుమ్మపాల సచివాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఈవో, సిబ్బంది



కశింకోట మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో కొంకి అప్పారావు



కశింకోట బాలికల హైస్కూలు విద్యార్థుల విన్యాసాలు

అనకాపల్లి రూరల్: తుమ్మపాల మేజర్ పంచాయతీలో గురువారం 74వ గణతంత్ర వేడుకలు జరిగాయి. గ్రామ సచివాలయంలో జాతీయ జెండాను ఈవో కె. శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, ఉప సర్పంచ్ మొగసాల లక్ష్మి, ఎంపీటీసీలు పన్నీరు వెంకటలక్ష్మి, చదరం నాగేశ్వరరావు, వార్డు సభ్యులు వై. రామారావు, టి. సత్యారావు, గారమానికి చెందిన సీనియర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విల్లూరి శేఖర్, మొగసాల వెంకట్, ఉన్నత పాఠశాల చైర్మన్ గొంతిన శ్రీను, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కశింకోట మండలంలో..

కశింకోట: మండలంలో గణ తంత్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కశింకోట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో కొంకి అప్పారావు జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. ఎంపీపీ కలగా లక్ష్మి, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, ఏవో ఏఏ ఖాన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ బి.సుధాకర్, పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ ఎ. ఆదినారాయణరెడ్డి జెండా ఎగుర వేశారు. కశింకోట పంచాయతీలో కార్యదర్శి ఎస్.రమేష్, తాళ్లపాలెంలో కార్యదర్శి వెంకటలక్ష్మి జాతీయ పతాకాలు ఎగుర వేశారు. సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, తాళ్లపాలెం ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని తదితరులు పాల్గొన్నారు. కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆచంట రవి, బాలికల హైస్కూల్లో హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి జాతీయ పతాకాలను ఎగుర వేశారు. బాలకల పాఠశాల విద్యార్థులు విన్యాసాలు, నృత్యాలు ప్రదర్శించారు. స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో డైరెక్టర్ బత్తుల నోబుల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధతో కలిసి జెండా ఎగుర వేశారు. విద్యార్థులు పలు విన్యాసాలు ప్రదర్శించి ఆహూతులను విశేషంగా అలరించారు. వివేకానంద స్కూల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. కరస్పాండెంట్ మళ్ల జగదీష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. తాళ్లపాలెం ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే తాళ్లపాలెం హైస్కూల్లో హెచ్‌ఎం విజయలక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వసంత పంచమిని పురస్కరించుకుని సరస్వతీదేవికి పూజలు చేశారు.



కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థుల విన్యాసాలు

పెన్షనర్ల సంఘం కార్యాలయంలో..

కశింకోటలోని పెన్షనర్ల సంఘం కార్యాలయం వద్ద గురువారం గణతంత్ర వేడుకలు నిర్వహించి జెండా ఆవిష్కరించారు. సంఘం ప్రతినిధులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



తాళ్లపాలెం బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో..

అనకాపల్లి టౌన్: పట్టణంలో వాడ వాడలా గణతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. జీవీఎంసీ కార్యాలయంలో జెడ్సీ వెంకటరమణ జాతీయ జెండాను ఎగురవేశారు. 83వవార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి చేతుల మీదుగా జీవీఎంసీ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గంగాధర్, పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ దాడి మోహనరావు, ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ఏడీఆర్ జగన్నాథరావు, గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవికుమార్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీను, ఆర్టీవో కార్యాలయంలో ఆర్టీవో వీర్రాజు, ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ సుజాత, ట్రాఫిక్ మేనేజర్ రవిచంద్ర, డీఈవో కార్యాలయంలో డీఈవో లింగేశ్వరరెడ్డి, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలతో పాటు డైట్ కళాశాలలో చైర్మన్ దాడి రత్నాకర్ వేడుకలు నిర్వహించారు. ఉడ్‌పేట బాలాజీదాస్ వీధి హ్యాపీ కిడ్స్ ప్లేస్కూల్లో చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ గిరీష్‌కుమార్ జెండా ఎగురవేసి సెల్యూట్ చేశారు.

గౌరీపరమేశ్వరుల మహోత్సవం రేపు



గౌరీపరమేశ్వరులు



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం గౌరీపరమేశ్వరుల మహోత్సవం ఈనెల 28వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావునాయుడు తెలిపారు. స్థానిక భీశెట్టి అప్పారావు కల్యాణ మండపంలో కొణతాల మురళీకృష్ణ అధ్యక్షతన గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 137 సంవత్సరాల చరిత్ర కలిగిన గౌరీపరమేశ్వరుల మహోత్సవరాజంకు ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలతో పాటు, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా విచ్చేస్తారని తెలిపారు. అమ్మవారి రథం ఊరేగింపు ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని.. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ సుమారు 40 స్టేజ్ ప్రోగ్రాంలు జరుగుతాయన్నారు. అనంతరం మహోత్సవరాజం ఉత్సవ పోస్టర్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల మహలక్ష్మీనాయుడు, ఉపాధ్యక్షుడు వెంకట వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన ఏర్పాట్లు

ఉత్తరాంధ్ర జిల్లాల్లో పేరుగాంచిన గవరపాలెం గౌరీపరమేశ్వరుల మహోత్సవరాజం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. శనివారం మధ్యాహ్నం నుంచి ఉత్సవం మొదలై ఆదివారం తెల్లవారుజాము వరకు కొనసాగుతుంది. స్థల పురాణం : సతకంపట్టులో వెలసిన గౌరీపరమేశ్వరుల ఆలయానికి విశిష్ట చరిత్ర ఉంది. ప్రస్తుతం సతకంపట్టుగా పేరొందిన గవరపాలెంలోని అమ్మవారు కొలువై ఉన్న ప్రాంతం 137 ఏళ్ల కిందట పొలాల్లో ఉండేది. ఈ ప్రాంతంలో ఉన్న మునగచెట్టు కింద స్థానికులు కొందరు గ్రామదేవత గైరమ్మను ప్రతిష్ఠించారు. పూరిపాకలో ఉన్న ఆలయం అభివృద్ధి చెందింది. ఈ క్రమంలో గుడిని నిర్మించి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఉత్సవం అమ్మవారి దర్శనంతో మొదలవుతుంది. ఈ ఏడాది సుమారు 30 సంఘాల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో అమ్మవారి ప్రసాద వితరణ జరుగుతుంది.

డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ



డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ గురించి రైతులకు వివరిస్తున్న అధికారులు

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ టి.దాసు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం వల్ల ఎకరాకి కనీసం 200 లీటర్ల నీరు, 500 ఎంఎల్ పురుగు మందు స్ప్రే అవసరపడుతుందన్నారు. కేవలం 8 నిమిషాల్లో ఎకరం పొలంలో పిచికారీ చేయవచ్చునని చెప్పారు. ఇతర పంటలైన వరి, మొక్కజొన్న, చెరకు, నువ్వు, జనుము, జీడి మామిడి, కొబ్బరిపై కూడా డ్రోన్ తో పిచికారీ చేసే సౌలభ్యం వుందన్నారు. ఈ డ్రోన్ ద్వారా పురుగు మందులే కాకుండా ఎరువులు, విత్తనాలను కూడా వినియోగించుకోవచ్చునని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించుకోవచ్చునని చెప్పారు. ఇందులో సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు, ఏవో రంగాచారి, ఆత్మ ఏటీఎం పి.రామకష్ణ, ఏఈవో ఎం. శ్రీనివాసరావు, రైతు సంఘం ప్రతినిధులు పడాల గణపతి, వెలగా మోదీనాయుడు, తర్ర సత్యారావు, మర్ది సుధీర్, వేగి కన్నప్పరావు, మోహన్‌రాజ్, ప్రదీప్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

4న ఆలయ భూముల కౌలుకు వేలంపాట

అనకాపల్లిటౌన్: స్థానిక వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ హక్కుభుక్తం గల మండలంలో గొలగాం సర్వేనంబర్ 264/1లో ఉన్న 3.00 సెంట్లు, సర్వేనంబర్ 112/8లో ఉన్న 2.90 సెంట్లు, సర్వే నంబర్ 212లో ఉన్న 2.32 సెంట్లు, ఉమ్మలాడ గ్రామంలో సర్వే నంబర్ 91/4లో ఉన్న 1.64 సెంట్లు, సర్వే నంబర్ 92లో ఉన్న 1.92 సెంట్ల భూములకు ఏప్రిల్ 4 నుంచి మార్చి 31 2026 వరకు మూడేళ్ల కాలానికి ఫిబ్రవరి 4న టెండర్ కం బహిరంగ వేలంలో కౌలుకు ఇవ్వనున్నట్లు ఆలయ ఈవో కె.ఆదినారాయణ తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి ఆసక్తిగల వారు ఒక్కొక్క విస్తీర్ణానికి రూ.5 వేలు ప్రథమ ధరావతు చెల్లించి పాటలో పాల్గొనాలని కోరారు. పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారు సంవత్సరం శిస్తు అడ్వాన్స్‌గా చెల్లించాలని పేర్కొన్నారు. పాటకు ముందు ఆధార్ కార్డు, రూ.లక్ష సాల్వెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని ఆయన కోరారు.

ఘనంగా మహాత్ముని తీర్థ మహోత్సవం



ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి పొందిన ముగ్గు

రావికమతం : కొత్తకోటలో మహాత్మా గాంధీజీ తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రగతి యూత్ ఆధ్వర్యంలో గత పదేళ్లుగా రాజకీయాలకతీతంగా నిర్వహిస్తున్నారు. ఏటా జనవరి 26న ఈ పండగను నిర్వహిస్తారు. గురువారం నిర్వహించిన ఆ తీర్థమహోత్సవం సందర్భంగా తొలుత గాంధీ మహాత్ముని విగ్రహానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, యువకులకు స్లో సైకిల్, స్లో బైక్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులందించారు. రాత్రి ఏర్పాటు చేసిన ఇంద్రజిత్ మిమిక్రీ, మ్యాజిక్ షో ఆకట్టుకుంది. కార్యక్రమంలో సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, ప్రగతి యూత్ గౌరవ అధ్యక్షురాలు కోట నీలవేణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి, కోట గోవిందరావు, సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను పాల్గొన్నారు.

శివాలయంలో టీడీపీ నాయకుల పూజలు

కశింకోట: మండలంలోని చింతలపాలెం గ్రామంలో ఉన్న శివాలయంలో టీడీపీ నాయకులు గురువారం అభిషేకాలు నిర్వహించారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టనున్న యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమాన్ని జరిపారు. పార్టీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మిత్రుడికి ఆపన్న హస్తం

దేవరాపల్లి : అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. ఎం.అలమండ గ్రామానికి చెందిన నరవ సింహాచలం తీవ్ర అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యాడు. అతని పరిస్థితి తెలుసుకున్న ఎ.కోడూరు పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆపన్న హస్తం అందించారు. వైద్య ఖర్చుల నిమిత్తం కొంత నగదు అందించి, అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణాన్ని సైతం పూర్తి చేస్తామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల తరఫున కోడిదాసు గణేష్, ఎడ్ల దేముడు, డి.సన్యాసిరావు, కొట్యాడ శివ, స్థానికులు తాడి చంటి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ భూముల ఆక్రమణల్ని తొలగించాలి’



వీఆర్వోలకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ కనకారావు

నాతవరం : గ్రామాల్లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ పి.కనకారావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో వీఆర్వోలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో కళ్లముందే విలువైన ప్రభుత్వ భూములు అక్రమణకు గురవుతున్నాయని జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విధంగా కొనసాగితే రానున్న రోజుల్లో గ్రామాల్లో ప్రభుత్వ అవసరాలకు, భవనాలకు భూములు దొరకవన్నారు. దీనిపై తహసీల్దార్ స్పందించి వీఆర్వోలకు ఆదేశాలు జారీ చేశారు. ఖాళీ చేయించిన భూములలో హెచ్చరిక బోర్డులతో పాటు, కంచె కంచె ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే రైతుల నుంచి వచ్చిన రెవెన్యూ ఫిర్యాదులపై యుద్ధప్రతిపాదికన స్పందించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రీ సర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సచివాలయాల ద్వారా రైతులకు అవసరమైన ప్రభుత్వ సేవలను అందించడంలో నిర్లక్ష్యం వద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐలు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండ

- గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



అంబేరుపురంలో మహిళలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం : అన్ని వర్గాల ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం మండలం అంబేరుపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల మంజూరుపై ఆరా తీశారు. ఎటువంటి అవినీతి లేకుండా ప్రభుత్వ పథకాలు నేరుగా పారదర్శకంగా ప్రజలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని కొనియాడారు. అర్హతే కొలమానంగా పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళాసాధికారత ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని ధర్మశ్రీ చెప్పారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకుని చెరకు రైతులకు చెరకు బకాయిలు పూర్తిగా చెల్లించినట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది చెల్లింపులు కూడా సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులకు సబ్సిడీ ఇవ్వడంతోపాటు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా పండిన పంటను కూడా అక్కడే అమ్ముకునేలా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో శ్యాంసుందర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, ఎంపీటీసీ శరగడం నాగేశ్వరరావు, ఎంపీటీసీల మాజీ ఫ్లోర్‌లీడర్ సూరిశెట్టి నాగదుర్గగోవింద, విశాఖడెయిరీ డైరెక్టర్ దాడి పవన్ కుమార్, గ్రామ సర్పంచ్ కార్లె ఈశ్వరరావు, ఉపసర్పంచ్ దాడి ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, చోడవరం పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిమజ్జనం



పురవీధుల్లో గౌరీ పరమరమేశ్వరుల ఊరేగింపు

గొలుగొండ: చీడిగుమ్మల గ్రామంలో గురువారం గౌరీపరమేశ్వరుల నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గౌరీపరమేశ్వరుల విగ్రహాల వెంట, అమ్మవారి సారెను ఊరేగించారు. మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఏటా మాదిరే ఈసారి కూడా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఊరేగింపు అనంతరం వరాహనదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

కేజే పురంలో ముగ్గురమ్మలు

మాడుగుల రూరల్ : మండలంలోని కేజే పురం గ్రామంలో ఎరుకమ్మతల్లి, మహాలక్ష్మితల్లి, మరిడమ్మ తల్లి ఆలయాలను గురువారం అత్యంత వేడుకగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా పూజలు, పాటు భారీ స్థాయిలో హోమం నిర్వహించారు. జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందాలు నిర్వహించారు. అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి జనాలు తండోపతండాలుగా తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.